www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 సెప్టెంబర్ 2025
5
చిత్తూరు

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 22వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 22వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్ సెల్

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 22వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 22వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

బడబళ్ల వంక ప్రాజెక్టు తూముకు గండి

- వృధాగా పోతున్న నీరు
- మూడు ఎకరాల్లోని టమాటా, వరి పంటలు నీట మునక
- పరిశీలించిన తహశీల్దార్, ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి - రొంపిచెర్ల

పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల సరిహద్దుల్లో సుమారు రూ.34.57 కోట్లతో నిర్మించిన బడబళ్ల వంక సాగునీటి ప్రాజెక్టు తూముకు గండిపడి లీకేజీతో నీరు వృధాగా పోతోంది. గత వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇక్కడ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు టెండర్లు నిర్వహించి పనులు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన 382 ఎకరాల భూములు ముంపుకు గురవుతాయని సర్వేచేసి గుర్తించారు. అయినా ప్రాజెక్టు పనులు మాత్రం పూర్తి చేశారు. కాలువల పనులు 80 శాతం పూర్తి చేశారు. మిగిలిన 20 శాతం కాలువ పనులు ఇంకా పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాలువ పనులు నిలిచిపోయాయి. 382 ఎకరాల ముంపు భూములకు రూ.10.68 కోట్లు నిధులు కేటాయించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకు రైతులకు చెందిన భూములకు ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన 4000 ఎకరాల భూములకు సాగునీరు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్‌కు కూడా రూ.23.89 కోట్ల మంజూరు చేయాల్సి ఉంది. ఇంతవరకు నిధులు విడుదల చేయలేదు. అంతేకాకుండా ప్రాజెక్టుకు భూమిలిచ్చిన రైతులు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి.

తూముకు గండి పడిందా.. పగలగొట్టారా...

బడబళ్ల వంక ప్రాజెక్టు తూమును ఎవరైనా పగలగొట్టారా.. లేదా నిజంగానే గండి పడిందా అని అధికారులు పరిశీలిస్తున్నారు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో ఒకసారి భారీ శబ్దం వచ్చిందని, మళ్లీ 11 గంటలకు మరోసారి భారీ శబ్దం వచ్చిందని సమీపంలోని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ శబ్దం విన్న చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళనకు గురైనారు. శనివారం ఉదయం వ్యవసాయ భూముల దగ్గరకు వచ్చిన రైతులకు ప్రాజెక్ట్ తూము నుంచి నీరు వృధాగా పోతుందని గ్రహించి రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే తహసీల్దారు అమర్నాథ్, ఏఈ మునిశేఖర్, ఎస్సై సుబ్బారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు తూము వద్ద పేల్చినట్లుగానీ, పగలగొట్టినట్లు గాని ఎలాంటి ఆనవాళ్లు కనబడటం లేదు. దీంతో ప్రాజెక్టులో చేరిన నీటికి తూముకు అమర్చిన బండ పగిలి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నీట మునిగిన పంటలు

బడబళ్ల వంక ప్రాజెక్టుకు గండి పడటంతో ప్రాజెక్టు కింద సాగులో ఉన్న మూడు ఎకరాల టమాటా, వరి పంటలు పూర్తిగా నీట మునిగాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరుతుంది. ప్రాజెక్టు సుమారు 70శాతం నిండింది. ఇంకా మూడు అడుగుల ఎత్తు నీరు వస్తే ప్రాజెక్టు నుంచి మొరవ పోయే అవకాశం ఉంది. ప్రాజెక్టులో నీరు చేరడంతో రైతులకు చెందిన సుమారు 20 వ్యవసాయ బోరు మోటర్లు నీటిలో మునిగిపోయాయి. ఈ మోటార్లను బయట తీసుకునేందుకు తూమును పగలగొట్టారా..? లేక ముంపు భూములకు నష్టపరిహారం మంజూరు కాకపోవడంపై ఆగ్రహంతో ఎవరైనా తూము బండను పగలగొట్టారా.. అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

పంట మొత్తాన్నా నష్టపోయాం..
- రైతు గుర్రప్ప, గాదిచెరువు పల్లె

బడబళ్ల వంక ప్రాజెక్టు తూము లీకేజీ కారణంగా ఒకటిన్నర ఎకరాలోని వరి పైరు, ఒకటిన్నర ఎకరాలో చేతికందిన టమోటా పంట నీటిలో పూర్తిగా మునిగిపోయింది. అప్పులు చేసి పండించిన పంట పనికి రాకుండా పోయింది. పంట నీటమునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించా అదుకోవాలి.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం..
- అమరన్నాథ్, తహశీల్దార్

బడబళ్ల వంక ప్రాజెక్టు తూము లీకేజీ కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తాం. వెంటనే తూము గండిని పూడ్చి వృధాగా వెళుతున్న నీటిని అరికడతాం. రైతులకు నష్టపరిహారం వచ్చేలాగా కృషి చేస్తాం.

ప్రాజెక్టును సందర్శించిన చల్లా రామచంద్రారెడ్డి

బడబళ్ల వంక ప్రాజెక్టు తూముకు గండి పడటంతో ప్రాజెక్టులోని నీరంతా వృధాగా పోతుందన్న విషయాన్ని తెలుసుకున్న పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రాజెక్టును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2019- 2024 మధ్య నిర్మించిన ప్రాజెక్టుకు భూములు కోల్పోయిన రైతులకు కనీసం ఒక రూపాయి నష్టపరిహారం చెల్లించకుండానే పనులు పూర్తి చేశారని, ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టులో నీరు చేరి గండి పడి సాగులోని పంట పొలాలు మునిగిపోయాయని తెలిపారు.

రైతులు తమకు నష్టపరిహారం చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చల్లా బాబుకు విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన నష్టపరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఓబులేశ్వర్ రెడ్డి, కుమార్ రెడ్డి ఉన్నారు.

గడిపడిన తూమును పరిశీలిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా బాబు

నీటమునిగిన టమోటా, వరి పంటలు

పిజిఆర్ఎస్ వాయిదా: కడ పీడీ

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం 22వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని వచ్చే సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్‌ను నిర్వహించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆధునిక సమాజపు అడుగుజాడ గురజాడ

గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమంలో జెవివి నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో ఆదివారం గురజాడ అప్పారావు 163వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు హెచ్.అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ కేవలం 53 సంవత్సరాలు మాత్రమే జీవించిన గురజాడ ఆనాటి దురాచారాలను ఖండిస్తూ నేటి సమాజానికి సైతం స్ఫూర్తినిచ్చి ఆధునిక సమాజానికి అడుగుజాడగా గురజాడ నిలిచారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్ బాబు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక యువతకు మ్యాజిక్‌పై శిక్షణా తరగతులు నిర్వహించి విద్యార్థులు చేత మ్యాజిక్ చేయించడం ద్వారా గ్రామీణ ప్రాంతంలో మూఢనమ్మకాలను పారద్రోలడానికి కృషి చేస్తామన్నారు. జిల్లా పర్యావరణ విభాగం కన్వీనర్ జి.సుధాకర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ప్లాస్టిక్ వస్తువులను రీసైక్లింగ్ చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షురాలు జయంతి మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు అవగాహన తరగతులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు వై.యస్. నాగేశ్వర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పాటు ఈ వ్యర్థాలను కూడా తగ్గించాలన్నారు. కోశాధికారి గిరిధర్ మూర్తి గురజాడ దేశభక్తి గేయాన్ని ఆలపించి అందరినీ అలరింపజేశారు. బాలచైతన్య, రంగనాథం, త్యాగరాజు నాయుడు, సాంబయ్య, రామచంద్ర, వేణుగోపాల్, త్యాగరాజు నాయుడు, విజయ్ కుమార్, సుదర్శనాచారి, ఆనంద్ బెన్, మొగిలయ్య, శివశంకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తనిఖీలు

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం సబ్-డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆకస్మిక తనికీలు నిర్వహించారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించిన అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ కుప్పం సబ్-డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అల్లర్లు, గొడవలకు తావుండరాదన్నారు. పోలీస్ మూమెంట్స్ బాగా పెంచాలన్నారు. అలాగే, విజిబుల్ పోలీసింగ్ ప్రతిరోజూ నిర్వహించడంపై స్పష్టమైన దృష్టి పెట్టాలని, ఇది ప్రజలలో భద్రతావగాహన పెరిగేందుకు సహాయపడుతుందన్నారు. ప్రతి గ్రామం, పట్టణంలో పోలీసు రాకపోకలు ఉంటే, దుష్టచర్యలు తగ్గిపోతాయని, రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై మరింత కఠినంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు కఠినంగా పాటించాలన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, మత్తు పదార్థాలపై ప్రజల అవగాహన కల్పించాలని, మహిళల భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చోరీలకు అడ్డుకట్ట వేస్తూనే ఇదివరకే జరిగిన నేరాలలో రికవరీలు పెంచాలన్నారు. డీఎస్పీ పార్థసారథి, కుప్పం అర్బన్ ఇన్స్పెక్టర్ శంకరయ్య, ఎస్బి ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న ట్రస్ట్ పేరుతో భూ కబ్జాలు

వివేకానంద విగ్రహం ఎదుట బాధితుల నిరసన దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాజన్న ట్రస్ట్‌ను అడ్డం పెట్టుకొని మాజీ మంత్రి, మాజీ ఎంపీ భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, గత పది సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ బాధ్యత రైతులకు న్యాయం చేయడం లేదంటూ ఆదివారం స్వామి వివేకానంద విగ్రహం ఎదుట బాధిత రైతులు రిలే నిరాహారదీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా రమణారెడ్డి, బాబు రాజేంద్రప్రసాద్, శంకర్, నరేంద్రబాబు, దీప, మనోజ్ కుమార్, కృష్ణమ్మ నాయుడు మాట్లాడుతూ తవణంపల్లి, అరగొండ మండలాల్లో రాజన్న ట్రస్ట్ అనేక భూకబ్జాలకు పాల్పడిందని బాధ్యత రైతులు భూములు కోల్పోయి. రెవెన్యూ అధికారులను ఆశ్రయించిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దిగువ మాగం పంచాయతీ కార్యదర్శి రాజన్న ట్రస్టు అక్రమకట్టడాలకు అనుమతులు ఇవ్వడం, ప్రభుత్వ రహదారిని అమ్మేసేలా తీర్మానం చేయడం అత్యంత దారుణమన్నారు. రాజన్న ట్రస్టు బాధ్యతలకు న్యాయం జరగాలని ఆదివారం నుండి మూడు రోజులపాటు స్వామి వివేకానంద విగ్రహం ఎదుట రిలే నిరాహార దీక్షలకు పూనుకుంటున్నట్లు తెలిపారు.

పని గంటలు తగ్గించి, కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి -పాకాల: స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో సిఐటియు మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మధుసూదన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 13 గంటల పనిని, 8 గంటలకు తగ్గిం చాలని, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు మురళి, ఆనంద్, శేఖర్, నరేంద్ర, వెంకటరమణ, మోహన్ బాబ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాలకు కేరాఫ్ కైగల్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: జిల్లాలోని బైరెడ్డిపల్లి మండలంలోని కైగల్ వద్ద వెలసిన దుముకురాళ్ల జలపాతం ప్రస్తుతం జలక్రీడలకు కేంద్రంగా మారింది. కర్ణాటక రాష్ట్రం నుండి ప్రవహించే నీరు ఈ జలపాతానికి ప్రాణం పోస్తూ, ప్రకృతి సౌందర్యాన్ని ఆవిష్కరిస్తోంది. వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి ఈ ప్రాంతం వివిధ రాష్ట్రాల నుండి వచ్చే యాత్రికులతో కిటకిటలాడుతోంది. ప్రకృతిని ఆస్వాదించాలనే ఉద్దేశంతో వచ్చే పర్యాటకులకు ఇది ఓ అద్భుతమైన గమ్యస్థానంగా నిలుస్తోంది.

ప్రతీరోజూ వందలాది మంది సందర్శకులు ఇక్కడికి వచ్చి జలపాతాన్ని చూసి ముచ్చటపడుతుండగా, పలువురు ప్రముఖులు కూడా ఈ ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే, చిత్తూరు జిల్లాకు అదనపు ఆదాయం, అవకాశాలు లభిస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. దుముకురాళ్ల జలపాతం నుండి ఆరంభమయ్యే నీటి ప్రవాహం కైగల్ దాటి తమిళనాడులోని గుడియాత్తం వైపు వెళ్లుతుంది. శీతాకాలపు వర్షాలతో ఈ ప్రాంత అడవులు పచ్చగా మారుతూ, వన్యమృగాలకు కీలక ఆధారంగా నిలుస్తున్నాయి. పర్యాటక అభివృద్ధితో పాటు ఈ నీటిని వినియోగించుకునే అవకాశాల దృష్ట్యా పలమనేరు శాసనసభ్యులు ఎన్.అమర్నాథ్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ ప్రాంతాన్ని నీటి వనరుగా అభివృద్ధి చేసి పరిసర గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, వర్షాకాలంలో అధికంగా వచ్చే సందర్శకులను దృష్టిలో ఉంచుకుని, పోలీసుశాఖ ఈ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపడుతోంది. ప్రజల సౌకర్యార్థం మరిన్ని పర్యాటక మౌలిక సదుపాయాలు, రహదారి వసతులు, గైడ్‌లు, సమాచార బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది. ప్రకృతి, పర్యాటకం, నీటి వనరుల మేళవింపు అయిన ఈ దుముకురాళ్ల జలపాతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయగలిగితే ఇది ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా వెలుగొందటం ఖాయం.

టీటీడీకి 18 క్లీనింగ్ యంత్రాలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల: కార్పొ రేట్ సోషియల్ రెస్పాన్స్‌బి లిటీ (సిఎస్ఆర్)లో భాగంగా ఐడిబిఐ బ్యాంక్ టీటీడీ ఆరోగ్య విభాగానికి రూ.19 లక్షల విలువైన 18 క్లీనింగ్ మెషీన్లను ఆదివారం విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ బ్యాంకు ఎండీ అండ్ సీఈఓ రాకేష్ శర్మ శ్రీవారి ఆలయం ముందు పేష్కార్ రామకృష్ణకు యంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆరోగ్యాధికారి మధుసూదన్, ఐడీబీఐ బ్యాంక్ రీజనల్ హెడ్ సాయికృష్ణ, తిరుపతి బ్రాంచ్ హెడ్ పల్లి రమేష్, బ్రాంచ్ మేనేజర్ దూడల రాజేష్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలను
ప్రభుత్వమే అభివృద్ధి చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : గత ప్రభుత్వం పేద విద్యార్థుల మెడికల్ సీట్లు అమ్ముకుని 107,108 లను తెచ్చి వైద్య విద్యా వ్యాపారం చేసిందని దీనిపై పోరాటాలు జరిగుతున్న దశలో.. కూటమి ప్రభుత్వం రాగానే వాటిని రద్దు చేస్తామని చెప్పి నేడు మొత్తం వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ విమర్శించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడం అన్యాయమని, తక్షణమే ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు అభివృద్ధి చేయాలనీ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు అక్బర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిమాండ్ చేశారు. అక్బర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధానాన్ని పీపీపీ రూపంలో కూటమి ప్రభుత్వం వైద్య విద్య ద్వారా బహిరంగంగా దోపిడీ చేసుకోడానికి దారులు తెరవడం సరికాదని ఆరోపించారు. రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలలు ప్రభుత్వమే అభివృద్ధి చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉంటుందన్నారు. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాల నిర్వహించడమంటే కార్పొరేట్ సంస్థలకు అప్పజేప్పడమేనని మండి పడ్డారు. ఇప్పటికే విద్య కార్పొరేట్‌లో వ్యాపార సరుకుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యార్థి సంఘాలు కలుపుకొని పోరాటాలకు సిద్ధం అవుతామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ హాస్టల్ సమస్యలు అనేకం ఉన్నాయని, ఈ సమస్యలపై జిల్లాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, తేజ, సహాయ కార్యదర్శిలు వీరష్, ఉమేష్, రమణ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, రవీంద్ర, సిద్దార్థ్ పాల్గొన్నారు.

సెలవుల్లో జాగ్రత్తలు పాటించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

సోమవారం నుంచి ప్రారంభం కానున్న దసరా సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి తెలిపారు. దసరా సెలవులను విద్యార్థులు కొంత సమయాన్ని చదువుల కోసం కేటాయించడంతోపాటు సరదాగా గడపాలని సూచించారు.

ప్రజాశక్తి: దసరా సెలవులు ఎప్పటినుండి ఎప్పటి వరకు?

డీఈఓ: ఈనెల 22వ తేదీ సోమవారం నుండీ అక్టోబర్ 2వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించింది.

ప్రజాశక్తి: జిల్లాలో విద్యాసంస్థలు విద్యార్థుల సంఖ్య?

డీఈఓ: చిత్తూరు జిల్లాలో 4, 247 ప్రాథమిక, 738 ప్రాథమికోన్నత,1 203 ఉన్నత పాఠశాలలతో పాటు 238 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 1,59,454 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

ప్రజాశక్తి: దసరా సెలవుల్లో విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

డీఈఓ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, చెరువుల్లో వర్షపు నీరు చేరుతోంది. ఈత సరదా పేరుతో వాగులు, వంకల వద్దకు వెళ్లడం ప్రమాదకరం. సెలవు రోజుల్లో విద్యార్థులను తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాలి. దసరా సెలవులను సరదాగా గడపడంతో పాటు చదువుకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ మేరకు విద్యార్థులకు తల్లిదండ్రులు చదువుపట్ల ఆసక్తి కలిగేలా చెప్పాలి.

ప్రజాశక్తి: దసరా సెలవుల్లో విద్యాసంస్థలు నడిపితే ఎలాంటి చర్యలు ఉంటాయి?

డీఈఓ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 22వ తేదీ సోమవారం నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించడం జరిగింది. యాజమాన్య పాఠశాలలతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలు కూడా తప్పనిసరిగా విద్యార్థులకు దసరా సెలవులను ప్రకటించాలి. విద్యాసంస్థలను కొనసాగిస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

రైతన్నలు జరభద్రం..!

- వర్షాకాలం..పాముల భయం..
- ఎటు చూసినా పిచ్చి మొక్కలు
- పొలాల వద్దకు వెళ్లాలంటే బిక్కుబిక్కుమంటున్న రైతులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ప్రస్తుతం వానలు పడుతున్నాయి.. దీంతో అన్ని ప్రాంతాలలో పచ్చదనంతో పాటు చల్లటి వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. రైతుల బీడు భూములలో, అటవీ ప్రాంతాలలో మొక్కలు ఎక్కువగా పెరిగి విష పురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. వాటి సంచారం ఇటీవల ఎక్కువగా ఉందని రైతన్నలు చెబుతున్నారు. కుంటలు, పశువుల పాకలు, పరిచిన కట్టెలు, ఇటుకలు, కాసు రాళ్ల వంటి చోట్ల విష పురుగులు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు అటవీ ప్రాంతాలకు వెళుతుంటారు. మేకల పెంపకదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా విష పురుగులు, పాము కాటుకు గురయ్యే ప్రమాదం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఆహారం కోసం బయటకు వస్తాయి..

వర్షాకాలం కావడంతో కప్పలు, ఎలుకలు చిన్నచిన్న పురుగులు బయటకు వస్తాయి.. వాటితో పాటు తొండలు, బల్లులు ఆరుబయటకు వస్తాయి. వాటి మేత కోసం సంతరిస్తూ ఉంటాయి. వీటిని వేటాడేటందుకు పాములు వెతుక్కుంటూ పచ్చదనం ఉన్న పొదల చాటుకు వెళతాయి. ఆ సమయంలో రైతులు, కూలీలు తెలియకుండా అటువైపునకు వెళితే పాము కాటుకు గురి అయ్యే ప్రాణాల మీదకి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 222 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఎక్కువ శాతం మంది రైతు కుటుంబాలే. లేచిన మొదలు నిద్రపోయే వరకు వ్యవసాయం పొలాల దగ్గరే జీవనం సాగిస్తారు. ప్రాణాలను పణంగా పెట్టి ముందుకు సాగుతుంటారు. ఎవరైనా అను కోకుండా పాము కాటుకు గురైన సమయానికి వైద్యం అందకుంటే ఒక్కసారిగా ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఒక వాదన..

పాటుకాట్లకు గురైన బాధితులు

వెదురుకుప్పం మండలంలో గత ఏడాది పెరుమాళ్ల పల్లి (పొరక పల్లి)కి చెందిన ఓ వ్యక్తి విష పురుగు కాటుకు గురై మృతి చెందాడు. ఈ ఏడాది మాంబేడు, మొరవ, దేవలంపేటకు చెందిన వ్యక్తులు పాటు కాట్లకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు.

పాము కాటు ఎలా జరగవచ్చు?

పాములకు చెవులు ఉండవని అందరికీ తెలిసిన సత్యం. వాటి శరీర భాగం కింద ఉండే ప్రత్యేక పొరల ద్వారా శబ్ద ప్రకంపనలను గుర్తిస్తాయి. వేడి రక్తం ప్రవహించే జంతువులు, మనుషులు సమీపంలో వచ్చినప్పుడు అవి వాసనతో వెంటనే వాటిని గుర్తించి కాటు వేస్తాయి. పాముల కాంతానికి భంగం కలిగినప్పుడు, ప్రాణ భయం వచ్చినప్పుడు ఎవరైనా వాటిని గుర్తించక తొక్కినప్పుడు మాత్రమే అవి కాటు వేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

తగిన రక్షణ కల్పించాలి



పాము కాట్ల నుండి తగిన రక్షణ పొందేందుకు కాళ్లకు పొడవైన బూట్లు, చీకటి వేళల్లో పొలం సమీపంలో విద్యుత్ దీపాలు వంటివి ఏర్పాటు చేయాలి. పాము కాటుకు గురైన బాధితులను రక్షించేందుకు తగిన మందులు ఆస్పత్రుల్లో అందుబాటులో వుంచాలి.. పొలాల సమీపంలో వున్న పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలి..

- రామకృష్ణయ్య, మాంబేడు దళితవాడ.

జాగ్రత్తలు తీసుకోవాలి..

గ్రామీణ ప్రాంతాలలో రాత్రి వేళల్లో తిరిగేవారు పొలాల దగ్గర, మూగజీవాల దగ్గర నిద్రించే రైతులు కూలీలు తమ వెంట టార్చ్ లైట్ ఖచ్చితంగా ఉంచుకోవాలి. నివాస ప్రదేశాలను రోజు ఎప్పటికప్పుడు చేసుకోవాలి. చుట్టూ కిరోసిన్, పెట్రోలు, డీజిల్ వంటి వాసనను వాటిని పాములు ఎక్కువగా భరించుకోలేవు. వీటిని ఉపయోగించి రైతులు కూలీలు రాత్రుల్లో సురక్షితంగా ఉండవచ్చునని నిపుణులు చెబుతున్నారు. పాదాల నుంచి మోకాళ్ల వరకు లెదర్‌తో కూడుకున్న బూట్లతో పడుకోవడం వల్ల చాలావరకు సురక్షితంగా ఉండవచ్చునని రైతుల్లో కొంతమంది అవగాహన ఉన్నవారు తెలిపారు.

ప్రథమ చికిత్స ఇలా చేసుకోవాలి?

పాము కాటు వేసినపై భాగంలో వెంటనే రక్తప్రసరణ జరగకుండా తాడుతో కట్టాలి.

పాము కాటుకు గురి అయిన వ్యక్తి ఎక్కువగా ఆందోళన చెందకుండా ఉండాలి.

కాటు వేసిన పాము అంతకుముందు ఆహారం తిన్న మరో జీవిని కాటు వేసిన విషం తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.

పాము కాటుకు గురి అయిన వ్యక్తి పరిస్థితుల్లోనూ ఆహారం, నీళ్ల ఇవ్వకూడదు.. నడిపించడం పరిగెత్తడం చేయకూడదు.

పిచ్చి మొక్కలతో ఏపుగా పెరిగిన రైతుల బీడు భూమి

నాటు మందులతో కాలయాపన చేయకుండా వెంటనే దగ్గరలో ఉన్న వైద్యశాలకు తరలించాలి ప్రథమ చికిత్స అందించాలి.

పాము కాటుకు గురి అయిన వ్యక్తిని నిద్రపోనికుండా చూసుకోవాలి.

పాము కాటు వేసిన దగ్గర ఖాళీ సిరంజితో విషాన్ని లాగాలి. ఇలా చేయడం వల్ల పాము కాటుకు గురి అయిన వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడే అవకాశం మెండుగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

ధైర్యంగా ఉండాలి

పాము కాటుకు గురి అయిన వ్యక్తి భయ పడకుండా ధైర్యంగా ఉండాలి. ఆలస్యం చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించాలి. పాము కాటు వేసినట్లు నిర్ధారించు కున్న తరువాత విరుగుడు మందు ఇస్తాం.. ప్రస్తుతం పీహెచ్‌సీ లో మందులు అందు బాటులో ఉన్నాయి. ఎల్లప్పుడూ సిబ్బంది అందుబాటులో ఉంటారు.

- డాక్టర్ చైతన్య కృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, పచ్చికాపల్లం, వెదురుకుప్పం మండలం.

డికె దంపతుల జయంతి సందర్భంగా అన్నదానం చేస్తున్న దృశ్యం

డీకే దంపతులకు ఘన నివాళి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మాజీ ఎంపీ , టీటీడీ మాజీ ఛైర్మన్ డీకే ఆదికేశవులు నాయుడు, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సత్యప్రభ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మురకంబట్టులోని ఆదికేశవ నాయుడు విగ్రహానికి డీకే బద్రీనాథ్, బలిజ సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బలిజ భవన్ లో డీకే ఆదికేశవులు నాయుడు, డీకే సత్యప్రభ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీకే బద్రినారాయణ మాట్లాడుతూ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు టిటిడి ఛైర్మన్‌గా, ఎంపీగా సేవలందించిన డీకే ఆదికేశవులు నాయుడు చిత్తూరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. చిత్తూరు ఎమ్మెల్యేగా డీకే సత్యప్రభ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు రామదాసు, కోలా కిరణ్, విశ్వనాధ్, పలువురు బలిజ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27 నుంచి లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీలక్ష్మీ నారాయణస్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ, అడ్వకేట్ కేఎస్‌వాసు, ఆలయ మేనేజర్ వెంకటేశులు రెడ్డి తెలిపారు. 27న అంకురార్పణ, 28న ధ్వజారోహణం, శేష వాహనం, సింహవాహనం, 29న మోహిని అవతారం, కళ్యాణోత్సవం, గరుడ సేవ, 30వతేది హనుమంత వాహన,గజవాహన సేవలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 1 వతేది రథోత్సవం, అశ్వ వాహనం, 2వతేది చక్ర స్నానం, ద్వాదర్శనం, ధ్వజ అవరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేయనున్నామని తెలిపారు.

వైసీపీ నాయకులకు శిక్ష తప్పదు: మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -శాంతిపురం:

ఏడు కొండల వాడి సన్నిధిలో నాడు పరకామణి దొంగలు...ఆ దొంగలనే దోచిన నాటి వైసీపీ అనకొండలు, వీడియోలతో సహా బయటపడుతున్న వైసీపీ హయాం నాటి టీటీడీ పెద్దల పాపాలు అని, వారికి శిక్ష తప్పదని టిడిపి అధికార ప్రతినిధి, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు,మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. 2019 నుంచి 2024వరకు తిరుమల శ్రీవారి సన్నిధిలో అనేక అపచారాలు, తప్పులు, పాపాలు,15 నెలల్లో అనేక సంస్కరణలు, నిర్ణయాల ద్వారా తిరులమ ప్రతిష్టను పెంచేందుకు టీటీడీ, ప్రభుత్వం పనిచేస్తున్నాయని గౌనివారి శ్రీనివాసులు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత కల్తీ నెయ్యి వ్యవహారంతో దేశం నివ్వెరపోయిందన్నారు. ధర్మారెడ్డి ఈవో గా, కరుణాకర్ రెడ్డి చైర్మన్ లుగా ఉన్న సమయంలో జరిగిన వన్నీ ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయన్నారు. ఈ కేసులో అన్యాయానికి పాల్పడిన వారికి శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.

టిడిపి మండల అధ్యక్షుడు సుబ్రమణిని సన్మానిస్తున్న నాయకులు

టిడిపి మండల అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సుబ్రమణిని ఆదివారం గుడుపల్లి మండలంలోని పలు గ్రామ పంచాయతీల నుండి విచ్చేసిన నాయకులు అతనికి శుభాకాంక్షలు తెలిపి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేస్తూ అందరికీ అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ఎప్పుడు ఎలాంటి సమస్య ఉన్నా తనను సంప్రదించాలన్నారు. అందరికీ అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు టి ఏం బాబు నాయుడు, మాజీ క్లస్టర్ ఇన్‌ఛార్జి హేమంబర్ గౌడు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: తిరుపతి జిల్లా, కూపుచంద్ర పేట గ్రామం హరి ప్రభు ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్య పితృ చివరి రోజు కార్యక్రమం నిర్వహించారు. స్వామి ఇంటి దగ్గర నుంచి దేవతల చిత్రపటాలు ఊరేగించారు. గ్రామం సమీపంలోని మామిడి వనంలో కొలువు తీర్చారు. ఈ కార్యక్రమానికి వెదురుకుప్పం మండలం, గొడుగుచింత గ్రామానికి చెందిన చక్రధర సిద్ధాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఆయనతో పాటు భక్తులు హాజరయ్యారు.

బంగారుపాళ్యం: తల్లిదండ్రులకు గుర్తుగా అన్నదానం చేశామని కరణం సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. మండలం మొగిలిలోని శ్రీ కామాక్షి సమేత మొగిలేశ్వర స్వామి ఆలయం సమీపంలో కరణం సంక్షేమ సంఘ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నపాపమ్మకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

చిన్నపాపమ్మకు పలువురి నివాళి

ప్రజాశక్తి -కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్‌కెవీబీ పేట గ్రామంలో పిఎసిఎస్ డైరెక్టర్ చెంగల్ రాయలు తల్లి, టిడిపి కార్యకర్త చంద్రగిరి చిన్న పాపమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. చిన్న పాపమ్మ మృత దేహానికి మండల టిడిపి అధ్యక్షులు చెంగల్‌రాయ యాదవ్, పిఎసిఎస్ ఛైర్మన్ జనార్ధన్ రాజు, ఎమ్మెల్యే సోదరులు రాజ, మండల ఉపాధ్యక్షులు సోమశేఖర్, కేఎంపురం మాజీ సర్పంచ్ పట్టెం సోమశేఖర్ యాదవ్, మాజీ మండలం ప్రధాన కార్యదర్శి హేమంత్ రెడ్డి, పీకేంపేట సర్పంచ్ గోవిందస్వామి, టిడిపి నాయకుడు ఢిల్లీ బాబు, బాలాజీ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు.

సుకుమార్‌కు పరామర్శ

ప్రజాశక్తి -పలమనేరు: ఈ నెల 13 వ తేదీన పలమనేరు ప్రశాంత్ నగర్ వద్ద ఒంటరి ఏనుగు దాడి లో గాయపడిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ ను తిరుపతి నారాయణ హాస్పిటల్ లో నూతన డిఎఫ్‌వో జి సుబ్బరాజు ఆదివారం పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకొని భరోసా కల్పించారు.

గాయపడ్డ డీఎఫ్‌వోను పరామర్శిస్తున్న నూతన డిఎఫ్‌వో

పార్టీని బలోపేతం చేయాలి: వైసిపి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా గ్రామాల్లో వైసిపిని బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీ అధ్యక్షులు కృషి చేయాలని మండల కన్వీనర్ బాగారెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సుహేబ్ కోరారు. రాయలపేట పంచాయతీ సచివాలయ పరిధిలోని వైసిపి గ్రామ కమిటీలను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయలపేట-1 గ్రామ కమిటీ అధ్యక్షులుగా మంజునాథ్ రెడ్డి, రాయలపేట 2- గ్రామ కమిటీ అధ్యక్షులుగా మునిరత్నం ఆచారిని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా రాజన్న, త్యాగరాజు,హుసేన్ బాషా, గంగిరెడ్డి, బావాజాన్, రవి కుమార్, రియాజ్ బాషా, వెంకటరమణలను కార్యదర్శలుగా దేవేంద్ర రెడ్డి, వెంకటేష్, క్రిష్ణప్ప, అంజాద్ బాషా,సుబ్రహ్మణ్యం లను ఎన్నుకున్నారు. పంచాయతీ యువత అధ్యక్షులు గా కరీముల్లా, శంకర ను,మహిళ విభాగం అధ్యక్షరాలు గా టి సుకన్యను ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శు లుగా రాజన్న, త్యాగరాజు, హుసేన్ బాషా, గంగిరెడ్డి, బావాజాన్, రవి కుమార్, రియాజ్ బాషా, వెంకటరమణను ఎన్నుకున్నారు. కార్యదర్శలుగా దేవేంద్ర రెడ్డి, వెంకటేష్ ,కృష్ణప్ప, అంజాద్ బాషా, సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నారు. పంచాయతీ యువత అధ్యక్షులుగా కరీముల్లా శంకరను ఎన్నుకున్నారు. మహిళ విభాగం అధ్యక్షరాలుగా టి.సుకన్యను వైసిపి మండల కన్వీనర్ బాగారెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సుహేబ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి అరుణా మునిరాజ, వైస్ ఎంపిపి జిడి బాబు, మాజీ సింగల్ విండో చైర్మన్ శంకరప్ప, స్థానిక ఎంపిటీసీ సరస్వతి గురునాథ్ రెడ్డి,స్థానిక నాయకులు హేమచంద్ర, పద్మనాభ జెట్టి, రహంతుల్లా, హనీఫ్ బాషా, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికైన వైసిపి మండల కమిటీ సభ్యులు

నేడు వైద్య నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థుల కు పరికరాలు అందించేందుకు వైద్య నిర్ధారణ శిబిరం సోమవారం ఉదయం 9.30 గంటలకు మండలంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించ నున్నట్లు ఎంఈవోలు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు అలింకో వైద్యుల సహకారంతో సమగ్ర శిక్ష చిత్తూరు వారి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభా వంతులకు ఉచితంగా పరికరాలు అందించేందుకు వైద్య నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేస్తామని చెప్పారు. నియోజక వర్గం లోని గంగాధర నెల్లూరు, వెదురుకుప్పం, కార్వేటి నగరం, పెనుమూరు, పాలసముద్రం, శ్రీరంగరాజపురం మండలాల పరిధిలోని 18 సంవత్సరాల వయసు లోపు వున్న ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ శిబిరానికి హాజరు కావచ్చని తెలిపారు. వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్ సిపి చైర్స్ చంక కర్రలు అందిస్తారని చెప్పారు. పరికరాల కోసం వచ్చే దివ్యాంగ విద్యార్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, యూడి ఐడి కార్డు జిరాక్స్ కాపీలు తెచ్చుకోవాలని తెలిపారు. పరికరాలు అవసరమైన విద్యార్థులు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాలవపల్లి రిజర్వాయర్ సందర్శన

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక సంఘం పరిధిలో గల కాల్వపల్లె రిజర్వాయర్ ను కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి ఆదివారం సందర్శించారు. రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండడం తో కాల్వ పల్లి ప్రజలతో కలిసి గంగా హారతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడు తూ కాల్వ పల్లి రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండడంతో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బంది కలగదని, రిజర్వాయర్ ఫిల్టర్ల బెడ్స్, మోటార్లను అవసరమైన మరమ్మతులు చేసి పట్టణ ప్రజలకు మరింత మెరుగైన నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాలువపల్లి రిజర్వాయన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి

ముగిసిన జనతా బజార్ మహాజన సభ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ది బాలాజీ కోపరేటివ్ సూపర్ బజార్, జనతా బజార్ 51వ మహాసభ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు సూపర్ బజార్ ప్రాంగణంలో అధ్యక్షులు ఆర్వి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు సూపర్ బజారు రాష్ట్రంలోని మొదటి స్థానంలో వుందని, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువ వ్యాపారం చేసి, అధిక ఆదాయం పొందిందని, వీటన్నింటికీ పలమనేరు నియోజకవర్గంలోని ప్రజలు , సూపర్ బజార్ సభ్యుల సహాయ సహకారాలని తెలిపారు. నేడు ఈ సమావేశానికి ఆశించినంతగా సభ్యులు రాలేదని, వచ్చే నెలలో సభ్యులందరికీ ముందస్తుగా సమాచారం ఇచ్చి మరొకసారి సమావేశంను ఏర్పాటు చేసి సభ్యులకు సూపర్ బజార్లో జరిగే వ్యాపార, లావాదేవీలు జమా ఖర్చులు, అభివృద్ధి గురించి వివరంగా వివరిస్తామని తెలిపారు. 2024-25 సంవత్సరంలో ది బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ లో మొత్తం సరుకుల కొనుగోలు రూ.24 కోట్ల 67 లక్షల 16,957లు, అమ్మకాలు రూ.26 కోట్ల 34 లక్షల 92,054.లు, స్టాకు నిల్వ రూ.2కోట్ల 5 లక్షల 25 వేల 554 లు అనీ,2024.25 సంవత్సరంలో దిబాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ ఖర్చులు పోను మిగిలినది రూ.24 లక్షల 77 వేల 841లు అని తెలిపారు. ఈ సమావేశంలో ది బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు , షేర్ హోల్డర్ సభ్యులు , ప్రజలు పాల్గొన్నారు.

జనతాబజార్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కేవైసీ పూర్తి చేయాలి: ఎంపిడివో

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో ఉపాధి హామీలో పనిచేస్తున్న వేతనదారులందరికి ఈకేవైసీ వెంటనే పూర్తి చెయ్యాలని ఎంపీడీఓ బాలాజీ ఉపాధి హామీ క్షేత్ర సహాయకులను ఆదేశించారు. ఆదివారం కొళత్తూరు గ్రామపంచాయతీ మద్దలకుంట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ వేతన కూలీలకు ఈ కేవైసీ నమోదు ను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశం మేరకు ఉపాధి హామీ పథకం వేతనదారులందరూ ఈకేవైసీ చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు అన్ని గ్రామాలలో వేతన దారులను కలిసి ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆయన క్షేత్ర సహాయకులను ఆదేశించారు. మండలంలో మొత్తం 11,540 మంది పనిచేస్తున్న వేతనదారులకు ఈ కేవైసీ చెయ్యాలని, ఇప్పటివరకు 4,350 మందికి ఈ కేవైసీ పూర్తి చేశామని, ఆదివారం మాత్రమే డ్రైవ్ మోడ్ లో 1,450 మందికి ఈ కేవైసీ చేశామని, మిగిలిన వారికీ ఈ నెల 25 తేదీలోపు పూర్తి ఏపీఓ మురగేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ సుబ్రమణ్యం, సిబ్బంది బాబు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ మానవత్వం

పేద మహిళ భర్తకు దహన సంస్కారాలు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణంలోని కెవిస్ట్రీట్‌లో నివసిస్తున్న ఓ మహిళ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ తన భర్తకు దహన సంస్కారాలు నిర్వహించలేని స్థితిలో పడింది. సహాయం కోసం ఆమె హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థను ఆశ్రయించగా, సంస్థ ప్రతినిధులు వెంటనే స్పందించి మానవత్వం చాటుకున్నారు. మహిళ భర్తకు కావాల్సిన ఏర్పాట్లు చేసి దహన సంస్కారాలు నిర్వహించారు. పేద ప్రజలకు కష్టకాలంలో అండగా నిలుస్తూ హెల్పింగ్ హ్యాండ్స్ మరోసారి తన సేవా గుణాన్ని చాటుకుంది. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ, షణ్ముక్ తేజ్, యల్లంపల్లి నరేంద్ర, అభినవ్, ఫర్హాన్, నవీన్ పాల్గొన్నారు. అనాథలకు, ఆర్థిక స్తోమత లేని వారికి దహన సంస్కారాలు చేయడానికి ముందుకు వచ్చే పలమనేరు హెల్పింగ్ హాండ్స్‌కు అభినందనలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలోని పాతపేటలో వెలసిన శ్రీ కనకదుర్గాదేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవ కార్యక్రమాలకు విచ్చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆదివారం ఎమ్మెల్యేను కనక దుర్గాదేవి సేవా సంఘం నాయకులు కలిసి సన్మానించి ఉత్సవ ఆహ్వానాన్ని అందించారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు అమ్మవారికి దివ్య అలంకారాలు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సునీతా నాగరాజు, బిఆర్సీ కుమార్, ఆలయ సంఘ సభ్యులు ప్రకాష్, తిరుమలేష్, సురేష్ , రత్నమ్మ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

క్రైం న్యూస్

ఇద్దరు మహిళలు అదృశ్యం: సీఐ

ప్రజాశక్తి -బంగారుపాలెం:

హేమశ్రీ

ఇద్దరు మహిళలు అదృశ్యమైనట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు ఆదివారం ఆయన కథనం మేరకు.. మొగిలి వెంకటగిరి గ్రామం చెందిన మధు కుమార్తె హేమశ్రీ (17) ఆదివారం ఉదయం నుండి కనిపించడం లేదని బాలిక తండ్రి మధు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కీర మంద గ్రామానికి చెందిన రజిని భార్య దీపిక (19) ఆదివారం ఉదయం 10 గంటలకు ఇంటి నుండి బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంగారు పాలెం పోలీస్ స్టేషన్‌లో భర్త రజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దీపిక

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని సి ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని ఇందిరా నగర్ సమీపంలో జాతీయ రహదారి వద్ద గల ఒక దాబాలో ఆక్రమంగా మద్య విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేపట్టగా వెలుతురు చేను గ్రామం చెందిన రాజేంద్ర కుమారుడు దీన వద్ద అక్రమంగా 20 క్వార్టర్ల మద్యం ఉండడంతో అదుపులో తీసుకుని అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తొమ్మిది మంది అరెస్ట్

రూ. 2600 నగదు, రెండు కోళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నెల్లిమంద పంచాయతీ ఎగువ చెరువు గుట్ట ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్నారన్న ముందస్తు సమాచారం మేరకు సోమల పోలీసులు కోడిపందేల స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 2,600 రూపాయల నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ చేస్తున్న దాతలు

కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి -రొంపిచర్ల : కల్లూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముగరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆదివారం 25 వేల రూపాయలు విలువచేసే కంప్యూటర్‌ను జిల్లా లయన్స్ క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షులు మహమ్మద్ అలీ, జాయింట్ సెక్రటరీ రాజారెడ్డి, రీజనల్ చైర్ పర్సన్ రామయ్య బహూకరించారు. విద్యార్థులు కంప్యూటర్ విజ్ఞానం కలిగి ఉండాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి లయన్స్ క్లబ్ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పులిచెర్ల ఎంఈఓ పోకల తాతయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు వెంకట సిద్ధులు పాల్గొన్నారు.

నెల్లిపట్ల రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి సహకారంతో నెళ్ళిపట్ల రోడ్డుకు మరమ్మతు పనులు మొదలు కాబోతున్నాయి. అధ్వానంగా తయారైన నెళ్లిపట్ల రోడ్డును బాగు చేయాలని అనేకసార్లు పత్రికల్లో ప్రచురితమైంది. దీంతో పాటు ఈ రహదారిలో గ్రామాల ప్రజలు పలుమార్లు మొరపెట్టుకోగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే మరమ్మతు పనులు మొదలు పెట్టాలని స్థానిక ఆ పార్టీ నాయకులను ఆదేశించారు. అతి త్వరలో నెల్లిపట్ల రోడ్డును పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రైతుల పొలాలు పరిశీలిస్తున్న డిఎఫ్‌వో సుబ్బరాజు

రైతులను ఆదుకుంటాం: డిఎఫ్‌వో

ప్రజాశక్తి -రొంపిచర్ల: ఏనుగుల దాడిలో వ్యవసాయ పంటలను కోల్పోయిన రైతులను ఆదుకుంటామని చిత్తూరు డిఎఫ్ఓ సుబ్బరాజు అన్నారు. పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడిలో పంటలు కోల్పోయిన రైతులను ఆదివారం ఆయన కలిసి నష్టపరిహారం అందేలా చేస్తామని తెలిపారు. పులిచెర్ల మండలం పాలెం పంచాయతీ జూపల్లి సమీపంలోనే అటవీ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్న ప్రదేశాలను ఆయన పరిశీలించారు. అడవి సరిహద్దు గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు ఒంటరిగా వ్యవసాయ భూముల వైపు వెళ్లరాదని హెచ్చరించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ థామస్, సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ, బీట్ ఆఫీసర్లు కృష్ణమూర్తి, మధు , అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వులపై హర్షం

ప్రజాశక్తి -గంగవరం: ఒక్కరోజే తెలుగులో పదకొండు జీవోలను విడుదల చేయడంపై తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసినాథం నాయుడు ఆదివారం హర్షం ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ కార్యకలాపాలు అన్నీ కూడా గ్రామ సచివాలయం నుండి రాష్ట్ర సచివాలయం వరకు తెలుగు భాషలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు అధికారభాషా సంఘాన్ని నియమించి తెలుగు భాషా రక్షణకు మార్గాలు అన్వేషించాలన్నారు. తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించి, తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యం కల్పించినప్పుడే తెలుగు భాష మనగలుగుతుందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.